కథా నిలయం
4299
శ్రీకాకుళం

# దెబ్బతిన్న సుజాత

సుజాత రోగుల్ని ఒక్కొక్కర్నీ చూసి వాళ్ళకు కావలసినసలహాలు యిచ్చి పంపిస్తోంది. ఆమెకు ఎదురుగా కుర్చీలో చాలాసేపటి నుండి ఒకామె కూర్చొని వుంది.తీరిగ్గా లేడీ డాక్టర్‌తో మాట్లాడుదామని వచ్చి, ఆమె రోగుల్ని అందరినీ చూసేవరకూ ఒపికతో కూర్చొంది.

సుజాత రోగులందర్నీ పంపించేసి ఆమెవైపుతిరిగి "నీలవేణిగారూ! మీకు చాలా శ్రమయిచ్చాను, క్షమించాలి. ఏదో చెప్పాలన్నారుకదూ-చెప్పండి" అంది.

నీలవేణి బలవంతంగా నవ్వి "లోపలికిరండి, మాట్లాడుకుందాం"అంది.

సుజాత ఆమెను తన ప్రయివేటు గదిలోకి తీసుకువెళ్ళి "చెప్పండి"అంది.

వెంటనే ఆమె చెప్పలేకపోయింది. కాని కొద్దిసేపట్లో ధైర్యాన్ని కూడగట్టుకుని "నేను తల్లిని కాబోతున్నాను. ఇంత వరకూ పెళ్ళి కాలేదు.కాని...."

"అర్థమయ్యింది. పొరపాటున కాలుజారానంటారు కదూ?"

"అవును.చాలా పొరపాటు జరిగింది. మోసపోయాను."

"అయితే నేను చేయవలసిన దేమిటి?"

"నేను తల్లిని కాకుండా మీరు సహాయపడాలి"

"క్షమించాలి. ఆవిషయంలో నేనేమీ సహాయం చెయ్యలేను. మా ఉద్యోగ ధర్మానికి వ్యతిరేకంగా మేమేమీ చేయలేము"

నీలవేణి జాలిగా ఆమె కళ్ళల్లోకి చూసింది."అంతేనంటారా డాక్టరుగారూ. నా విషయం ఆలోచించండి. నేను తప్పు చేశాను. అది వప్పుకోడంలో నాకు సిగ్గులేదు. ప్రతివారూ జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక తప్పు చెయ్యకుండా వుండరు" అంది.

"మీరు తప్పు చేసినా ఒప్పు చేసినా నేనేం చేయగలను చెప్పండి" అంది సుజాత.

"మీరు పూనుకొంటే ఆమాత్రం సహాయం చెయ్యకపోరు. కొద్దిగా నావిషయం మీరు అర్థంచేసుకోవాలి.చదువు వదిలిపెట్టాక ఉద్యోగం గురించి వెతుక్కోవలసి వచ్చింది.తండ్రికి దీర్ఘ రోగం. తల్లి లేదు. చెల్లెళ్ళుమాత్రం యిద్దరున్నారు. అట్టే కష్టపడనక్కర లేకుండానే కొద్దికాలానికే ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం దొరికింది. అది నా అదృష్టం అనుకున్నాను. కాని నిజానికి అది నా దురదృష్టం. అంత వేగంగా ఉద్యోగం దొరకడానికి కారణం నేను ఆడదాన్ని గనుక. మేనేజరు గారికి నన్ను చూడగానే నామీద ఏర్పడ్డ జాలి, అభిమానం, ప్రేమ యీ ఉద్యోగం రావడానికి కారణమట. కాదన్నాను నేను. ఆ మర్నాటినుంచి ఉద్యోగం పోయింది. మళ్ళీ ఉద్యోగం గురించి తిరిగి తిరిగి చివరకు అక్కడే చేరాను. దాని ఫలితం-మీకు చెప్పాను కదూ.ఎలాగైనా మీరుసహాయం చెయ్యాలి"

సుజాత నిట్టూర్చింది. కాని అంతలోకే ఆమె ముఖంలో గాంభీర్యం ప్రవేశించింది.

"లాభం లేదండి. మీరు ఎన్ని చెప్పినా యీకేసు నేను తీసుకోలేను.డాక్టరుగా నా వృత్తి ధర్మాన్ని నేను పాటించవలసివుంది. ఈ విషయంలో మీకు ఏవిధంగానూ సహాయపడలేక పోతున్నందుకు క్షమించాలి."

"అంతే నంటారా?" ఆమె జాలిగా అడిగింది. ఆమె కళ్ళల్లో నీళ్ళు చేరాయి.

"ఇంకా నేను పైకి రావలసినదాన్ని. ఇప్పుడు మీరు కోరినట్టుగా చేస్తే అది నా వ్యక్తిత్వానికీ, గౌరవానికీ భంగం కలిగించేదవుతుంది. ఏమయినా ఆపని నేను చేయలేను"

ఆఖరిమాట సుజాత చాలా స్థిరచిత్తంతో అంది. అలా అని, తిన్నగా ఆఫీసు రూంలోకొచ్చి కూర్చుంది. కుర్చీలో వెనక్కు జారబడి పైకి చూస్తూ 'మనుషులు ఒక్కొక్కప్పుడు ఎందుకు తెలివి తక్కువ పనులు చేస్తుంటారో అర్థంకాదు' అనుకొంది.

నీలవేణి కూడా మెల్లగా లేచొచ్చి సుజాతకు ఎదురుగా కూర్చుని దీనంగా ఆమె ముఖంలోకి చూస్తూ "ఈసమస్య పరిష్కారంద్వారా ముగ్గురు ఆడపిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోవుంది.మీరు మరోసారి ఆలోచించాలి"అంది.

సుజాతకు విసుగు,కోపం పుట్టుకొచ్చాయి. ఆమె ఎంతకీ కదలడంలేదు. చెప్పినా వినిపించుకోవడంలేదు."తప్పు చేయగాలేనిది ఆమాత్రం దాని ఫలితం అనుభవించ డానికి భయపడతారేం" అంది అసహనంగా, కోపంగా.

నీలవేణి అభిమానం దెబ్బతిన్న ట్టనిపించింది. అనవసరంగా తన రహస్యాన్ని యితరులముందు బైటపెట్టుకున్నట్టయ్యింది. ఆమె కళ్ళు కోపంతో ఎర్ర బడ్డాయి.ముక్కుపుటాలు ఎగసిపడ్తున్నాయి. ఆమె చివాల్న కుర్చీలోంచి లేచినుంచొని "డాక్టరు గారూ! ఇదే సంఘటన మీ జీవితంలోనూ జరిగిందనుకోండి. ఎంత బాధ పడతారు మీరు. మీకు చెల్లెలు వుండి, ఆమె యిలాంటి పరిస్థితుల్లో చిక్కుకున్నప్పుడు మీరు వూరుకుంటారా?"అంది. ఆమాటలు అంటున్నప్పుడు ఆమె కంఠం బొంగురు పోయింది. అక్కడనుండి ఆమె చరచరా అవతలకు వెళ్ళిపోయింది.

ఆమె వెళ్ళినవైపే చూస్తూ కూర్చుంది సుజాత.

నిజానికి ఆమెపట్ల సుజాతకు సానుభూతి,అభిమానం వున్నాయి. ఆమెను చాలా కాలంనుండి ఎరుగును. అట్టేపరిచయం లేకపోయినా ముఖ పరిచయం మాత్రం ఉంది. ఆమె ఆవీధి చివర డాబాయింట్లో వుంటున్నట్లు సుజాతకు తెలుసు. పాపం పొరపాటున కాలుజారింది. ఏంచెయ్యడానికీ సమయం మించిపోయింది. ఇప్పుడు ఆపరేషన్ చెయ్యాలి. కాని- అందుకు తన అంతరాత్మ ఒప్పుకోవద్దూ?

ఆమె కోపంతో ఏదేదో అంది. తనజీవితంలో అలా జరిగితే ఏంచేస్తానట! తనచెల్లెలు అలాంటి పరిస్థితుల్లో వుంటే ఊరుకోనట.!

సుజాత తనలో తనే నవ్వుకుంది.

ఆమెకళ్ళలో చెల్లెలు నిర్మల ప్రతిఫలించింది. తనపెంపకంలో పెరిగిన చెల్లెలికి యిలాటి పరిస్థితి ఎదురయ్యే ప్రశ్నే లేదు. ఆమెకు చెల్లెలిపట్ల అంత నమ్మకం. ఈమధ్య ఒకటి రెండుసార్లు గుణాకరం ప్రస్తావన దొర్లినమాట నిజమేకాని అంతమాత్రంచేత చెల్లెలు కానిపనులు చేస్తోందని భయపడిపోవలసిన అవసరంలేదు - అనుకుందిసుజాత.

చెల్లెలు గుర్తుకొచ్చినతరువాత ఒకసారి ఆమెను చూడాలనిపించింది.'రెండు రోజులు సెలవు పెట్టి ఒకసారి రావే' అని చెల్లెలికి ఉత్తరం రాసింది. కానీ నిర్మల

రాలేదు ."పరీక్షలు దగ్గర పడ్డాయి,వెళ్ళేది ఫైనల్ ఎగ్జామినేషన్, ఎలా వచ్చేది?" అని జవాబు రాసింది.

సుజాతకు చెల్లెలంటే అభిమానం. యూనివర్శిటీలో ఆనర్స్ ఫైనలియర్ చదువుతోంది. చెల్లెలు చాలా తెలివైనదని, చురుకైనదని సుజాత అభిప్రాయం.

సుజాత చెల్లెల్ని చూసి చాలా రోజులైంది. కిందటి వేసవి సెలవుల్లో వచ్చింది. -అంతే! ఆతర్వాత క్వార్టర్లీ, హాఫియర్లీ సెలవులకు మళ్ళీ రాలేదు. తనే ఉండలేక ఓరెండుసార్లు వెళ్ళి చూసివచ్చింది. ఆమెను చూసి అప్పుడే మూడు నెలలు కావస్తోంది. మళ్ళీ మనసు చెల్లెలి మీదకు మళ్ళింది.ఒకసారి వీలయితే తనే వెళ్ళి చూసి వద్దా మనుకుందికాని తను వెళ్ళడానికి సుజాతకి తీరిక చిక్కలేదు.

పరీక్షలు అయిపోయాయి. సెలవులు ఇచ్చారు. పరీక్షలు కాగానే స్నేహితురాళ్ళతో సరదాగా మహాబలిపురం వెళ్తున్నానని అక్కకి ఉత్తరం రాసింది నిర్మల.

ఉత్తరం చూసిన తర్వాత సుజాత యిక ఆగలేకపోయింది. పరీక్షలు అయిపోయిన మర్నాటి ఉదయానికల్లా చెల్లెలు తనముందు వుంటుందనుకొంది. చెల్లెల్ని చూద్దామని కళ్ళు కాయలు చేసుకొని కూర్చుంది. కానీ చెల్లెలు రాలేదు. ఆమె బదులు ఉత్తరం వచ్చింది.!

సుజాత ఉద్యోగానికి మూడు రోజులు సెలవు పెట్టి చెల్లెలి దగ్గరకి బయలుదేరింది. అప్పటికి పరీక్షలు అయి రెండు రోజులయ్యాయి.

అకస్మాత్తుగా చెప్పాచెయ్యకుండా వచ్చిన అక్కయ్యను చూసి ఆశ్చర్యపోయింది నిర్మల. నిజానికి ఆమె ఆ రాత్రికే మహాబలిపురం వెళ్ళే ప్రయత్నంలో ఉంది.

"మహాబలిపురం వెళ్తున్నట్టు ఉత్తరం రాశాను, అందలేదా"? అంది నిర్మల.

"అందిందనుకో. నిన్ను చూసి చాలారోజులైందికదా, ఊరికే ఒకసారి చూద్దామనిపించి బయలుదేరి వచ్చేశాను . నీకయితే ఏమీ అక్కరలేదు. ఒకమారు అక్కడికి వచ్చి ఆతర్వాత మహాబలిపురం వెళ్తే ఏంపోయింది, నేను వెళ్ళొద్దంటానా" అంది సుజాత.

నిర్మల ఏమీ మాట్లాడలేదు.

""ఏమిటోనే నిర్మలా నిన్ను చూడకపోతే నామనసు పిచ్చెత్తినట్లుంటుంది.నువ్వు తప్ప నాకింకెవరున్నారు చూసుకోడానికి" అంది తిరిగి.

అక్క అభిమానంచూస్తుంటే ఆమెకు దుఃఖంపొర్లుకొస్తోంది. అక్కపడే యీ తాపత్రయం అంతా తనగురించే...తనను పైకి తీసురావాలనే. తల్లిలా ఎంతో ప్రేమతో, ఆప్యాయతతో తనకోసం యింతగా ఆరాటపడే అక్కంటే ఆమెకు ఒకదేవతలాగే అనిపిస్తోంది. తనకు తల్లిలేని కొరత తీర్చింది అక్క. తను ఏది అడిగితే అది సమకూర్చింది. అలాంటి అక్కనుకాదని తనేనా ఒక గొప్పసాహసం చెయ్యబోతున్నది?....

చెల్లెలు కళ్ళవెంట కన్నీరు కారడం సుజాతకు ఆశ్చర్యాన్ని కలిగించింది. "ఏం నిర్మలా ... ఏమిటాకన్నీరు!... ఏమైంది!" ఆప్యాయంగా చెల్లెలి ముఖాన్ని తనవైపు తిప్పుకుంటూ ఆమె కళ్ళలోకి చూసింది.

అక్కమాటల్లోని ఆత్మీయం , ఆమెచూపుల్లోని చల్లదనం నిర్మలను మరింతగా బాధించాయి. అక్కచేతుల్లోకి వాలి వెక్కివెక్కి ఏడ్చింది.

సుజాతకు అంతా అయోమయంగావుంది . చెల్లెలు ఎందుకేడుస్తున్నదీ ఆమెకు అర్థంకాలేదు. ఆమెను దగ్గరకు తీసుకుని కన్నీళ్ళను తుడిచి "నాతో చెప్పవా నిర్మలా! నీకు ఏం తక్కువ చేశానని? నీ గురించేకదా యీ తాపత్రయం అంతా. చెప్పు నిర్మలా ఎందుకేడుస్తున్నావ్?" అంది.

నిర్మల చెప్పలేదు. ఏడ్చిఏడ్చి లేచి వెళ్ళిపోయింది.

సుజాతకూడా రెట్టించి అడగలేదు. చెల్లెలి మనస్తత్వం ఆమెకు తెలుసు. తను బయలుదేరి వచ్చేసేలోగా తనంతటతనే ఆ విషయం తప్పకుండా చెప్తుందని ఆమె నమ్మకం.

అయినా ఆమె మనసు కీడును శంకించకుండా వుండలేకపోతోంది. ఆ శంక ఆమెను పురుగుతొలిచినట్టు తొలుస్తున్నా పైకిమాత్రం నిబ్బరంగా కనిపించడానికి ప్రయత్నిస్తూ ఆ హాస్టలు రూములో నిమిషాల్ని లెక్కపెడుతూ కూచుంది.

మధ్యాహ్నం మెస్‌కు వెళ్ళి భోంచేసి వచ్చారు. సుజాత పరీక్షల సంగతులు గురించి అడిగితే నిర్మల చెప్తోంది. అప్పుడే వార్డెన్ కబురంపించింది ఎవరో ఒకతను ఫోను చేశాడని. నిర్మల వెళ్ళి మాట్లాడి వచ్చింది. వస్తూనే "గుణాకరం అక్కా...ఫోను చేశాడు" అంది నిర్మల, అక్క కళ్ళల్లోని ప్రశ్నార్థకానికి జవాబుగా.

సుజాత 'ఆహా!' అన్నట్టు చూసివూరుకుంది.

నిర్మల కిటికీముందు కూర్చుని బైటికి చూస్తూ చాలాసేపు అలానే

వుండిపోయింది. ఆమెతిరిగి అక్కవైపు చూసేసరికి అక్క తననే చూస్తుండడం కనిపించింది.

నిర్మలకు యింక దాయాలనిపించలేదు. అక్కకు తన మనసులోని విషయాన్ని తెలియజెప్పాలనుకుంది. కాని అందుకామెకు ధైర్యం చాలడంలేదు. పావుగంట గడిచినా ఆమెలోంచి ఏమాటా బైటపడడంలేదు. చివరికి ఆమె ధైర్యాన్ని కూడగట్టుకుని "మహాబలిపురం వెళ్తున్నది స్నేహితురాళ్ళతో కాదక్కా...గుణాకరంతో" అంది. ఓ క్షణం ఆగి ఊపిరితీసుకుని తిరిగి చెప్పడం ప్రారంభించింది-

"నీతో కేవలం మహాబలిపురానికనే చెప్పాను. కాని పూర్తిగా అది నిజంకాదు. ముందుగా యిక్కడే మేమిద్దరం రిజిష్టరు మేరేజి చేసుకుని, ఆ తర్వాత సరదాగా ఓ పదిహేను రోజులపాటు దక్షిణాదిన తిరిగివద్దాం అనుకున్నాం. నువ్వు యిప్పుడు రాకపోతే నిజంగా యీ రాత్రికి వెళ్ళిపోయేవాళ్ళమే. అక్కా నీతో ఆ విషయాన్ని చెప్పడానికి భయమేసింది. అతన్ని ప్రేమిస్తున్నాననికూడా చెప్పే ధైర్యం లేకపోయింది.ఊళ్ళు తిరిగొచ్చాక అన్ని విషయాలూ నీకు చెప్పుదామనుకున్నాను"

సుజాత ఆశ్చర్యపోలేదు. ఆమె ఊహలు కొంతవరకు నిజమయ్యాయి. తననుంచి చెల్లెలు ఏ విషయమూ దాచదని యింతకాలం నమ్మిన తన నమ్మకం వమ్మయిపోయినందుకు మాత్రం ఆమె మనసు విలవిల్లాడింది.

చెల్లెలు ఆవిధంగా ప్రవర్తించినందుకు ఆమెకు అంతగా ఆశ్చర్యం కలగలేదుకాని ఆరోజున నీలవేణి అన్నమాటలకుమాత్రం ఆశ్చర్యపోయింది.

చెల్లెలు తప్పుచేసిందా లేదా అన్నది ముఖ్యంకాదు. తనెంతో నమ్మకాన్ని పెట్టుకున్న చెల్లెలికి, నీలవేణికి పెద్దగా తేడా ఏమీ వున్నట్టనిపించలేదు. ఆరోజున ఆమె ఎంత వాస్తవికంగా అంది! అప్పుడు అవన్నీ వట్టిమాటలకింద తోసిపుచ్చింది. పిచ్చివాగుడుకింద జమకట్టింది. కాని ఆలోచించిచూస్తే అందులో ఎంత నిజముంది! నిజంగా యిలాటి పరిస్థితుల్లో తను ఏంచేస్తుంది?

సుజాత చెల్లెలి నిర్ణయాన్ని ఏవిధంగానూ కాదనలేదు. "సరే, నీయిష్టం. ఆయన్నే పెళ్ళిచేసుకోవాలనుకుంటే అందరూ చేసుకునే విధంగానే పెళ్ళిపందిరికింద బాజాభజంత్రీలతో బ్రాహ్మణుల వేదమంత్రాలమధ్య గౌరవంగానే చేసుకోవచ్చు. ఇప్పట్లోనన్నా, లేక కొంత కాలంపాటు ఊర్లన్నీ తిరిగి వచ్చిన తర్వాతనన్నా మీ యిద్దరికీ పెళ్ళిచేయడానికి నాకు అభ్యంతరం ఏమీలేదు."

సుజాత మరొకరోజు అక్కడే వుండి గుణాకరాన్ని కలుసుకుని అన్ని విషయాలూ మాట్లాడి చెల్లెల్ని వెంటబెట్టుకొని వెళ్ళిపోయింది.

ఊరు చేరిన రోజునే నర్సును పిలిచి వీధి చివర డాబాయింట్లో వుంటున్న నీలవేణిని ఒకమారు పిలుచుకొని రమ్మని పంపించింది.

కాని నీలవేణి రాలేదు. "వారు ఎందుకు రమ్మన్నారో నాకు తెలుసు. ఏమిటి చెప్పాలనుకుంటున్నారోకూడా నేను ఊహించగలను. కాని, లోకం నన్ను తల్లిగా గుర్తించింది. వారి సహాయం నాకు యిక అనవసరం" అంది.

నర్సు ఆమె అన్నమాటల్నే వెళ్ళి సుజాతతో చెప్పింది. క్షణంసేపు కొయ్యబొమ్మలా మాటాపలుకూ లేకుండా వుండిపోయింది సుజాత.